క్లుప్తంగా

నేదురుమల్లికి నేతల శుభాకాంక్షలు



వెంకటగిరి(సైదాపురం): వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి జన్మదినం సందర్భంగా బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద పలువురు నేతలు శుభాకాంక్షలు తెలిపారు. వారిలో వెంకటగిరి రూరల్, బాలాయపల్లి మండల అధ్యక్షులు కాల్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వెందోటి కార్తీక్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు ఎం.వెంకటేశ్వర్లు, చింతల శ్రీనివాసులురెడ్డి, జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ తదితరులు ఉన్నారు.

బెంగళూరుకు ప్రత్యేక బస్సులు

రాపూరు: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రాపూరు ఆర్టీసీ డిపో నుంచి బెంగళూరుకు ఈనెల 10, 11 తేదీల్లో ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ అనీల్‌కుమార్ తెలిపారు. ఈ బస్సుల్లో మామూలు చార్జీలే వసూలు చేస్తామని, ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళలకు ముగ్గుల పోటీలు



కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల మేనేజర్ రామక్రిష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రశేఖరరెడ్డి, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ వల్లీదేవి పాల్గొన్నారు.

అటవీ భూములు ఇప్పించాలి

పెళ్లకూరు: తమకు గ్రామ సమీపంలో ఉన్న అటవీ భూములు ఇప్పించాలని కానూరు కొండ కింద నివాసం ఉంటున్న నిరుపేద గిరిజనులు కోరారు. వారు బుధవారం కానూరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తమ కాలనీ సమీపంలో ఉన్న అటవీ భూముల్లో జామాయిల్ సాగు చేసుకుంటుంటే ఆ శాఖ అధికారులు మొక్కలను పెరికేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీశాఖ అధికారులతో మాట్లాడి జామాయిల్ సాగు చేసుకోవడానికి అనుమతులు ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సంతోషిణిబాయి, నాయకులు కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, ప్రసాద్‌యాదవ్, ప్రసాద్ నాయుడు, మురళీనాయుడు పాల్గొన్నారు.

బాలికల గురుకుల ప్రిన్సిపాల్‌కు పరామర్శ



భరత్‌కుమార్ గాంధీ మృతదేహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నాయుడుపేట టౌన్: చిట్టమూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పుదూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రూత్ రమోల భర్త భరత్‌కుమార్ గాంధీ(60) మృతి చెందారు. ఈ క్రమంలో ప్రిన్సిపాల్‌ను పలు గురుకులాలకు చెందిన ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పరామర్శించారు. ఆమె భర్త మృతికి సంతాపం తెలిపారు. నాయుడుపేట బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దాదాపీర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

చిల్లకూరు: మండలంలోని పారిచెర్లవారిపాళెంలో బుధవారం గూడూరుకు చెందిన వైజీపీ లయన్స్ క్లబ్, టౌన్ క్లబ్ సంయుక్తంగా లయన్ వరదిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి దాతృత్వంతో 150 మంది గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. లయన్ వరదిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి పేదలకు సాయం అందించాలని కోరారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు పీవీ మనోజ్‌కుమార్, గోపీనాథ్ రెడ్డి, ఎస్ సుబ్రమణ్యం, శ్రీనివాస్, ప్రసాద్, ఆర్‌వీరావ్, గురునాధం, బాబూరావు, వరదిరెడ్డి రామోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి చేయూత

గూడూరు రూరల్: గూడూరు పట్టణంలోని శాంతినగర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి బుధవారం ప్రగతి సేవా సంస్థ ప్రతినిధి మురళీనాయుడు బుధవారం సీలింగ్ ఫ్యాన్, కుక్కర్, గ్యాస్ స్టవ్, పలకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో మోహబూబి, సూపర్ వైజర్ స్వరూప, మౌనిక, సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, కోశాధికారి శ్రీనివాసులు, శ్యామ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఫ్యాను, గ్యాస్ స్టవ్ అందజేస్తున్న ప్రగతి సేవా సంస్థ ప్రతినిధులు

ముందుకు చొచ్చుకొచ్చిన కొండలు



ఘాట్‌రోడ్డులో పలు చోట్ల కూలిన పిట్టగోడలు, అదుపు తప్పితే అగాధంలోకే



ఘాట్‌రోడ్డులో అధ్వానంగా ఉన్నరోడ్డు





పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఎంతో మహిమాన్వితుడు. ఇక్కడికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు. ముఖ్యంగా కడప జిల్లా వాసులకు ఆరాధ్య దైవం కావడంతో వెలుగొండ అడవుల మీదుగా ఆలయానికి వస్తుంటారు. దీనికి తోడు రాపూరు నుంచి కడప జిల్లాకు చింతపండు, పసుపు, పండ్లు, కూరగాయలు రవాణా అవుతున్నాయి. ఈ క్రమంలో రాపూరు–చిట్వేలి మధ్య ఉన్న ఘాట్ రోడ్డులో నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటోంది. ఈ రోడ్డులో ఒక వైపు లోయలు, మరోవైపు కొండలు ఉన్నందున ప్రయాణం ప్రమాదభరితంగా ఉంటోంది. కొన్ని మలుపుల వద్ద రక్షణగోడలు సరిగా లేవు. రోడ్డు కూడా సక్రమంగా లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఘాట్‌లో ఆదమరిస్తే అంతే..!

- దెబ్బతిన్న రోడ్డు, రక్షణ గోడలు
- రెండు వైపులా పెరిగిన చెట్లు
- ఏ మాత్రం ఆదమరిచినా లోయలోకే
- పట్టించుకోని ఆర్ అండ్‌బీ అధికారులు

రాపూరు: శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా – వైఎస్సార్ కడప జిల్లాను కలుపుతూ వెలుగొండ అడవుల మధ్య ఏర్పాటు చేసిన రాపూరు–చిట్వేలి మధ్య ఉన్న ఘాట్ రోడ్డుకు దశాబ్దాల చరిత్ర ఉంది. రాజుల కాలం నుంచి రాపూరు మంచి వ్యాపార కేంద్రంగా విరాజిల్లుతుండడంతో కడప జిల్లాకు సరుకులు రవాణా అయ్యేవి. ఇందుకోసం ఎడ్ల, గుర్రపుబండ్లు తిరిగేందుకు కడప నవాబులు అడవుల మీదుగా బండిబాట ఏర్పాటు చేశారు. బ్రిటీష్ వారి హయాంలో రాపూరు–చిట్వేలి రోడ్డుకు ప్రాధాన్యత పెరగడంతో రోడ్డు మార్గంగా మలిచారు. తదనంతరం ఈ రోడ్డు గుండా వాహనాల రద్దీ పెరిగింది. నెల్లూరు నుంచి రాజంపేట, కడపకు, కదిరి, రాయచోటి, కోడూరు, వెంకటగిరి, కడపకు ఆర్టీసీ సర్వీసులు నడుస్తున్నాయి. అలాగే రాజంపేటకు చెందిన బస్సులు రాపూరు, నెల్లూరు, విజయవాడకు నిత్యం ప్రయాణికులను చేరవేస్తుంటాయి. సింగిల్ రోడ్డు కావడం, మలుపులు వద్ద సూచిక బోర్డులు, పిట్టగోడలు లేకపోవడం, అక్కడక్కడా రోడ్డు మార్జిన్ వద్ద ఒక అడుగుపాటు లోతులో రోడ్డు ఉండడంతోపాటు ప్రమాదాలు జరుగుతున్నాయి.

ప్రమాదాల్లో పదుల సంఖ్యలో మృతులు

2008 జూన్ 8వ తేదీన వాకాడు డిపోకు చెందిన బస్సు కడప నుంచి వాకాడుకు వెళుతూ లోయలో పడిపోయింది. దీంతో ముగ్గురు మృతి చెందారు. అలాగే 2008 సెప్టెంబర్ 11వ తేదీ రాత్రి పెంచలకోన నుంచి కోడూరుకు వెళుతున్న టూరిస్ట్ బస్సు లోయలోపడి 14 మంది మరణించారు. 2014 ఫిబ్రవరి 20వ తేదీ గ్యాస్ లోడుతో వస్తున్న లారీ లోయలో పడిపోయింది. గ్యాస్ సిలిండర్లు పేలి ఉంటే పెద్ద ప్రమాదమే సంభవించి ఉండేది. లోయవైపు నిర్మించిన ప్రొటెక్షన్ వాల్ కొన్ని చోట్ల దెబ్బతినింది. 2015 నవంబర్‌లో కురిసిన వర్షాలకు ఘాట్ రోడు పలుచోట్ల దెబ్బతినింది. పలుచోట్ల పిట్టగోడలు పడిపోయాయి. మలుపుల వద్ద ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు వంగి పోయాయి. ఎక్కడ మలుపు ఉందో తెలియడంలేదు. ఘాట్ రోడ్డుకు ఇరువైపుల వేసిన బర్మస్ నాణ్యత లేనందున రాళ్లన్నీ లేచిపోయాయి. ముఖ్యంగా రాపూరు నుంచి చిట్వేలి వెళ్లే మార్గంలోని 11–12 కిలోమీటర్ వద్ద ఉన్న మలుపులో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మలుపుల వద్ద పటిష్టమైన రక్షణ గోడలు నిర్మించడంతోపాటు స్టీలు లైనింగ్‌లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రోడ్డు వెడల్పు చేసి స్పీడు బ్రేకర్లు కూడా నిర్మించాలి. వీటితోపాటు మలుపులను సూచించే రేడియం ప్లేట్లను ఏర్పాటు చేస్తే ప్రమాదాలు జరగకుండా ఉంటాయని ప్రజలు, వాహన దారులు కోరుతున్నారు.

బర్మమ్స్ ఏర్పాటు చేయాలి



ఘాట్‌లో ఇరు వైపులా రోడ్డు కుంగిపోయింది. అంతేగాక గుంతలు పడ్డాయి. దీంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదం బారిన పడుతున్నాయి. నిత్యం సరుకులు రవాణా చేస్తుంటాము. అదుపుతప్పితే అంతే సంగతులు. రోడ్డుకు ఇరువైపులా బర్మమ్స్ ఏర్పాటు చేయాలి.
– అంకయ్య, ట్రక్ డ్రైవర్, రాపూరు

అంచనాలు పంపాం



రాపూరు–చిట్వేలి రోడ్డులో పడిపోయిన పిట్టగోడలు, బర్మమ్స్, సీసీ రోడ్డు తదితరాల మరమ్మతులకు రూ.1.15 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైలన వెంటనే పనులు చేపడతాం. రోడ్డు ప్యాచ్ వర్క్‌లకు రూ.15 లక్షలు మంజూరు చేశారు. త్వరలో పనులు ప్రారంభిస్తాం.
– మనోహర్, ఆర్‌అండ్‌బీ ఏఈ, రాపూరు

బలమైన రక్షణగోడలు ఏర్పాటు చేయాలి



ఘట్‌రోడ్డులో లోయలు ఉన్న పాంతాంలో బలమైన రక్షణగోడలు, స్టీలు లైనింగ్‌లు ఏర్పాటు చేయాలి. మలుపుల వద్ద రేడియం సూచక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు పెట్టాలి. ఇరుకుగా ఉన్న మలుపుల్లో రోడ్డు వేడల్పు చేయాలి. రోడ్డుకు ఇరు వైపులా చెట్లను తొలగించాలి. చిట్వేలి వైపు ఘాట్ రోడ్డు వెడల్పుగా ఉంది.
– పరుశురామ్, ఆర్టీసీ డ్రైవర్, రాజంపేట డిపో

రోడ్డు వెడల్పు చేయాలి



రాపూరు నుంచి సరిహద్దు వరకు ఉన్న ఘాట్ రోడ్డును వెడల్పు చేయాలి. పడిపోయిన పిట్టగోడలను పటిష్టం చేయాలి. కొన్ని చోట్ల పిట్టగోడలు పడిపోయాయి. కొండ రాళ్ల ముందుకు ఉండడంతో వాహనాల ప్రమాదాల బారిన పడుతున్నాయి. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలి.
–పెంచలయ్య, ఆర్టీసీ డ్రైవర్, నెల్లూరు డిపో

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



పిట్టగోడ పడిపోయిన చోట కనీసం అధికారులు సూచక బోర్డులు కాని రాళ్లుగాని ఏర్పాటు చేస్తే బాగుంటుంది. రాత్రి సమయంలో వాహనాల డ్రైవర్లకు తెలియక ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి సూచక బోర్డులు ఏర్పాటు చేయాలి.
– మురళీ, ట్రక్ డ్రైవర్, చిట్వేలి

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

వెంకటగిరి రూరల్: వెంకటగిరి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి కమిషనర్ శ్రీనాథ్ తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులు, అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

చిల్లకూరు: ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఐ నాయకులు దుయ్యబట్టారు. వారు బుధవా రం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ పేదలకు పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్ల ఇళ్ల స్థలాలు మంజూరుచేయాలని డిమాండ్ చేశారు. రైతులకు సాగు భూములు పంపిణీ చేయాలని, ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని, తల్లికి వందనం అమలుచేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మురళీ, జిల్లా కార్యదర్శి హీచ్ ప్రభాకర్, శశికుమార్, ఎంబేటి చంద్రయ్య, షేక్ కాలేషా, గండాల రమేష్, ఎస్ శ్రీనివాసమూర్తి, చల్లా వెంకటేశ్వర్లు, రఘురామయ్య పాల్గొన్నారు.

గిరిజనులను చైతన్యం చేయండి

సైదాపురం: విద్య, వైద్య ఆరోగ్యంపై గిరిజనులకు అవగాహన కల్పించి చైతన్యవంతులను చేయాలని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి ఆదేశించారు. మండలంలోని చాగణం రాజుపాళెంలో బుధవారం సర్పంచ్ పోట్లూరు వెంకటరమణమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యానాదులు విద్య నేర్చుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలను లబ్ధిపొంది జీవనోపాధి పెంపొందించుకునేలా చూడాలన్నారు. బ్యాంకు రుణాలు ఇప్పించాలని సూచించారు. ప్రతి కుటుంబమూ పొదుపు సంఘాల్లో చేరి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎల్ఆర్ టీమ్ లీడర్ ఉషారాణి, ఎస్ఈఆర్పీ ఉన్నతి డైరెక్టర్ రాజా ప్రతాప్, ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్, ఐబీ వాల్మీకి, డీపీఎంలు భానుప్రసాద్, కామాక్షి, ఏపీఎం చంద్రశేఖర్, కెనరా బ్యాంకు మేనేజర్ బాలరాజు పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

సైదాపురం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ పలుగోటి పెంచలమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ తెలిపారు. మండలంలోని అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు తప్పక హాజరుకావాలని కోరారు.

కండలేరులో 56.612 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 56.612 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి 180 క్యూసెక్కుల నీరు వస్తోందని తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 650, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

జగన్‌ను కలిసి వైఎస్సార్ సీపీ నేతలు



వైఎస్‌జగన్‌తో కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నేదురుమల్లితో రాపూరు వైఎస్సార్‌సీపీ నాయకులు



జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే కిలివేటి, డీసీసీబీ మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి

సైదాపురం/రాపూరు/వాకాడు/బాలాయపల్లి(సైదాపురం)/పెళ్లకూరు/నాయుడుపేట టౌన్/సూళ్లూరుపేట/గూడూరు రూరల్ : మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నేతలు కలిశారు. వారిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.రవికుమార్ యాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.శ్రీనివాసులురాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు వి.ప్రభాకర్‌రెడ్డి, సోషల్ మీడియా యాక్టివిస్ట్ కంభం విజయభాస్కర్ రెడ్డి, అబ్బిరాజు, రాపూరుకు చెందిన దందోలు లక్ష్మీనారాయణరెడ్డి, బొడ్డు మధుసూదన్‌రెడ్డి, దుగ్గిరెడ్డి నరసింహారెడ్డి, పోలంరెడ్డి ప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, వాకాడు జెడ్పీటీసీ రౌతు రామకృష్ణ, కొడవలూరు దామోదర్‌రెడ్డి, కల్లూరు సర్పంచి దువ్వూరు భాస్కర్‌రెడ్డి, బాలాయపల్లి మండల కన్వీనర్ వెందోటి కార్తీక్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నాయుడుపేటకు చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరి కామిరెడ్డి రాజారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు కటకం జయరామయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ ఓట్టురు రాధ కిషోర్ యాదవ్, సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, తడ ఎంపీపీ కొళవి రఘురెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు గండవరం సురేష్‌రెడ్డి, గూడూరుకు చెందిన పార్టీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, చేవూరు విజయమోహన్‌రెడ్డి, బత్తిని విజయకుమార్, గూడూరు ఎంపీపీ బూదూరు గురవయ్య, జెడ్పీటీసీ ఊటుకూరు యామిని, రాష్ట్ర జాయింట్ సెక్రటరి ఊటుకూరు మహేంద్రరెడ్డి, యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు సునీల్‌రెడ్డి, ప్రభాకర్‌రాజు ఉన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ జయలక్ష్మి

వెంకటగిరి రూరల్: బాల్య వివాహాలను అరికట్టేందుకు అందరూ కృషిచేయాలని మహిళా శిశుసంక్షేమ శాఖ పీడీ జయలక్ష్మి ఆదేశించారు. వెంకటగిరిలోని విశ్వోదయ డిగ్రీ కళాశాలలో బుధవారం ఐసీడీఎస్ సీడీపీవో శంషాద్‌బేగం ఆధ్వర్యంలో కిశోరి వికాసంపై అవగాహన కల్పించారు. వామె మాట్లాడుతూ ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తుంటే 1098, 100 నంబర్లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. 11 నుంచి 18 ఏళ్లలోపు బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబనపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎస్ఐ లక్ష్మీ భవాని మాట్లాడుతూ ఎవరైనా వేధింపులకు గురిచేస్తే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, టీపీఎస్ ప్రతినిధి జయసింగ్, కేవీకే శాస్త్రవేత్త విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

సైదాపురం: బాలికల సంరక్షణపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ చూపాలని రాపూరు సీడీపీవో సునంద తెలిపారు. సైదాపురంలో బుధవారం కిశోరి వికాసంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలు జరిగితే టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. బాలికలకు గుడ్, బ్యాడ్ టచ్ తదితరాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పోస్టర్, డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీడీపీవో షేక్ షానవాజ్, ఎంపీడీవో పురుషోత్తం శివ కుమార్, మండల వైద్యాధికారి నిత్య ప్రశాంతి, ఎంఈవోలు దయాకర్, సుప్రియ, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు రాధిక ధనమ్మ, ఫాతిమా పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

నాయుడుపేట టౌన్: బాల్య వివాహాలు నేరమని, వాటిని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంఈవో మునిరత్నం, సీడీపీవో ఉమామహేశ్వరి కోరారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో బుధవారం కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, వార్డు సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. గ్రామాల్లో పాఠశాలకు వెళ్లని పిల్లలను గుర్తించడంతోపాటు బాల్య వివాహాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు అధికారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు షేక్ ఆశాబేగం, మణెమ్మ, సాయిలక్ష్మీ పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న నేదురుమల్లి అభిమానులు

కోట: వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం కోట మండలం గూడలిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. నాయకులు వేమారెడ్డి షనీల్‌రెడ్డి, నాగూర్‌రెడ్డి, హనుమంతరెడ్డి, సత్యనారాయణ, భక్తవత్సల్‌రెడ్డి, ఆములూరు నాగార్జున పాల్గొన్నారు.

మంచినీటి పథకం పరిశీలన



రాపూరు: పోకురుపల్లిలో ఉన్న సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని బుధవారం నెల్లూరు జెడ్పీ సీఈవో విద్యారమ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో మంచినీటి సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పోకురుపల్లి ఎస్టీకాలనీకి పైపు లైన్ ద్వారా మంచి నీటిని సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం రూ.4 లక్షలు మండల పరిషత్ నిధులను వినియోగించాలని సూచించారు. జెడ్పీ వైస్ చైర్మన్ ప్రసన్న, ఎంపీడీవో భవాని, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మోహన్‌రావు, ఏఈ ఆంజనేయులు, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ఆర్గనైజింగ్ సెక్రటరి, పీడీ

గూడూరు రూరల్: గూడూరు పట్టణంలోని ఎస్.కె.ఆర్.ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజులు నిర్వహించిన విక్రమ సింహపురి యూనివర్సిటీ ఇంటర్ కాలేజీయేట్ గూడూరు జోన్ మెన్ క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. విజేతగా ఎస్‌కేఆర్ జట్టు నిలిచింది. ఈ సందర్భంగా ఆర్గనైజింగ్ సెక్రటరి, పీడీ నారాయణరాజు మాట్లాడుతూ బుధవారం జరిగిన పోటీల్లో 9 వికెట్ల తేడాతో గూడూరు ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు విజేతగాను, సూళ్లూరుపేటకు చెందిన ఎస్‌వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు రన్నర్‌గా నిలిచాయన్నారు. ఈ టోర్నీని ప్రారంభించిన యూరప్‌లోని టీసీఎస్ హెడ్ సప్తగిరి చేవలపల్లి విజేతలను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.శివప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసులు, సూళ్లూరుపేట పీడీ అమ్మాజీ, యూనివర్సిటీ అబ్జర్వర్ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు వెంకన్న ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి పూజలు

నాయుడుపేట టౌన్/దక్కిలి : వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం తుమ్మూరులోని శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్య స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ హరిరెడ్డి తెలిపారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు గరుడ వాహన సేవ, గ్రామోత్సవం చేపడతామని వెల్లడించారు. అలాగే చంద్రబాబు కాలనీలో ఉన్న కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త కామిరెడ్డి రాజారెడ్డి తెలిపారు. బ్రాహ్మణవీధిలో ఉన్న కల్యాణ వెంకటేశ్వర స్వామి, తిమ్మాజి కండ్రిగ గ్రామ స్వర్ణముఖి నది తీరం వద్ద అభయ అనుగ్రహ వెంకటేశ్వర స్వామి తదితర చోట్ల ఆలయాల్లోనూ ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తామని వివరించారు. అదేవిధంగా దక్కిలి మండలంలోని వెలిగొండల కింద వెలసిన ఆదిలక్ష్మి సమేత యోగ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలోనూ ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నట్టు అధికారులు తెలిపారు.

పెంచలకోన ఆలయానికి భారీ ఆదాయం

రాపూరు: మండలంలోని పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన సీల్డ్ టెండర్లు, బహిరంగ వేలం పాటల్లో భారీ ఆదాయం వచ్చినట్లు ఏసీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. 2025–2026 ఆర్థిక సంవత్సరానికి గాను ఆలయంలో టెండర్లు నిర్వహించామన్నారు. ఆలయంలో టెంకాయలు, పూజాద్రవ్యాలు విక్రయించేందుకు రూ.72.80 లక్షలు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునేందుకు రూ.35.20 లక్షలు, టోల్‌గేట్ రుసుము వసూలుకు రూ.27.10 లక్షలు, వస్త్రాలు సేకరించే హక్కుకు రూ.11 లక్షలు, చెప్పులు భద్రపరిచేందుకు రూ.5.65 లక్షలు, పుష్పాలు విక్రయించేందుకు రూ.12 లక్షలు వచ్చినట్లు తెలిపారు. గత సంవత్సరంకంటే ఈ సంవత్సరం రూ 31.72 లక్షలు అధికంగా వచ్చినట్టు ఏసీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

కలువాయి: మండల కేంద్రమైన కలువాయి విశ్వం పాఠశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు రంగు రంగుల ముగ్గులు తీర్చిదిద్దారు. సంప్రదాయ దుస్తులు ధరించి ఆకట్టుకున్నారు. గుడిసెలు వేసి, హరిదాసు, బొమ్మల కొలువు ఏర్పాటు చేసి గొబ్బెమ్మలను పెట్టి భోగిపళ్ల తదితరాలతో సంబరాలను జరుపుకున్నారు. అనంతరం పిల్లల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో కరస్పాండెంట్ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అదేవిధంగా కుల్లూరు పంచాయతీ వెంకటరెడ్డిపల్లి, ఎస్సీకాలనీలో మాదాసు నళినమ్మ ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.



పిల్లల నృత్య ప్రదర్శన



విజేతలకు బహుమతులిస్తున్న మాదాసు నళినమ్మ